

# హదీసులు కూడా కేవలం అల్లాహ్ యొక్క వహీనే!


తఖ్రీజ్: హాఫిజ్ సలాహుద్దీన్ యూసుఫ్ రహిమహుల్లాహ్

తెలుగు అనువాదం: ఇక్రాముద్దీన్ ముహమ్మద్

ABU ZAFAR IKRAMUDDIN




AbuZafar Creative Designs


Copyright © 2020 Ikramuddin Mohammad. All rights reserved.



Contact: +91 94410 85899

**Copyright © 2020 Ikramuddin Mohammad**

ABU ZAFAR IKRAMUDDIN

*All rights reserved.*

*No part of this Book may be reprinted or reproduced or utilized in any form, or by any electrical, mechanical or other means now known, or hereafter invented, including photocopying and recording, without prior permission from the presenter/owner Ikramuddin Mohammad.*

*For individual purpose only. Not for sale / Not for Printing (for sale).*

**First Edition: 1442 H / November 2020 CE**

**కాపీరైట్ కు సంబంధించిన ముఖ్య గమనిక:**
ప్రస్తుత సమాజంలో జరుగుతున్న కొన్ని అవాంఛనీయ విషయాలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఈ రకమైన కాపీరైట్ చేయడం జరిగింది. కావున, ఈ పుస్తక సమర్పకుడు / అనువాదకుడు అయిన ఇక్రాముద్దీన్ ముహమ్మద్ నుండి ముందస్తు అనుమతి లేకుండా దయచేసి ఈ చిరు పుస్తకాన్ని ఎలాంటి ధనార్జన కొరకు లేదా స్వప్రయోజనాల కొరకు అస్సలు ఉపయోగించకూడదు. అలాగే ఇందులోని సమాచారాన్ని తమ సంస్థల పేరున ఎలక్ట్రానిక్ కాపీలుగా చేయడం, ఆడియో లేదా వీడియోలుగా రికార్డ్ చేయడం లేదా ఇతర మాధ్యమాల కొరకు ఉపయోగించడం వగైరా వంటివి చేయకూడదు. అల్లాహ్ ప్రసన్నత కొరకు కేవలం ధర్మప్రచార దావా బోధనల రీత్యా ముస్లిం సోదర, సోదరీమణులందరికీ ఈ చిరు పుస్తకాన్ని యధాతధంగా షేర్ చేయడంలో ఎలాంటి ఇబ్బంది లేదు. చదవండి, అందరితో చదివించండి. జజాకుముల్లాహు ఖైరా!

**తఖ్రీజ్: హాఫిజ్ సలాహుద్దీన్ యూసుఫ్ రహిమహుల్లాహ్, షోబా తహ్ఖీఖ్ వతాలీఫ్, దారుస్సలామ్, లాహోర్**
**తెలుగు అనువాదం, సమర్పణ: ఇక్రాముద్దీన్ ముహమ్మద్**
**పరిశీలన: షేఖ్ నసీరుద్దీన్ జామి'ఈ మరియు సోదరులు అబ్దుల్ ఖాదిర్ హాఫిజహుముల్లాహ్**

మరిన్ని వివరాలకు మరియు అలాగే ఈ చిరు పుస్తకంలో ఏదైనా లోటుపాట్లు, అచ్చుతప్పులు, సరిదిద్దులను గమనించిన యెడల దయచేసి క్రింద తెలియజేయబడ్డ నంబరుకు వాట్సప్ లేదా టెలిగ్రామ్ ద్వారా లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించగలరని విన్నపం. జజాకుముల్లాహు ఖైరా!

**Contact: +91 94410 85899 (Whatsapp / Telegram)**
**Email: siratulmustaqeem07@gmail.com**

# హదీసులు కూడా కేవలం అల్లాహ్ యొక్క వహీనే!

★ బిస్మిల్లాహ్ వల్ హమ్దులిల్లాహ్. వస్సలాతు వస్సలాము 'అలా రసూలిల్లాహ్, వ 'అలా ఆలిహి వ అస్హాబిహీ వసల్లమ తస్లీమన్ కసీరా. 'అమ్మా బ'అద్.

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِمْ ءَايَاتُنَا بَيِّنَٰتٍۙ قَالَ ٱلَّذِينَ لَا يَرْجُونَ لِقَآءَنَا ٱئْتِ بِقُرْءَانٍ غَيْرِ هَٰذَآ أَوْ بَدِّلْهُۚ قُلْ مَا يَكُونُ لِىٓ أَنْ أُبَدِّلَهُۥ مِن تِلْقَآئِ نَفْسِىٓۖ إِنْ أَتَّبِعُ إِلَّا مَا يُوحَىٰٓ إِلَىَّۖ إِنِّىٓ أَخَافُ إِنْ عَصَيْتُ رَبِّى عَذَابَ يَوْمٍ عَظِيمٍ

**"మరియు మా స్పష్టమైన ఆయతులను వారికి చదివి వినిపించినప్పుడు మమ్మల్ని కలుసుకునే నమ్మకం లేనివారు అంటారు: "దీనికి బదులుగా మరొక ఖుర్ఆన్ తీసుకురా లేదా ఇందులో సవరణలు చెయ్యి." (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "ఇందులో నా అంతట నేను మార్పులు చేయటం నా పని కాదు. నా వద్దకు పంపబడే దివ్యజ్ఞానాన్ని (వహీని) మాత్రమే నేను అనుసరిస్తాను. నిశ్చయంగా, నేను నా ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘిస్తే, ఆ గొప్ప దినమున శిక్ష పడుతుందని భయపడుతున్నాను!"**

**Quran 10:15**

مَا ضَلَّ صَاحِبُكُمْ وَمَا غَوَىٰ. وَمَا يَنطِقُ عَنِ ٱلْهَوَىٰٓ. إِنْ هُوَ إِلَّا وَحْىٌ يُوحَىٰ.

**"మీ సహచరుడు (ముహమ్మద్), మార్గభ్రష్టుడు కాలేదు మరియు తప్పు దారిలోనూ లేడు. మరియు అతను తన మనోవాంఛలను అనుసరించి కూడా మాట్లాడడు. అది (అతను పలుకుతున్నది), అతనిపై అవతరింపజేయబడిన దివ్యజ్ఞానం (వహీ) మాత్రమే."**

**Quran 53:2-4**

★ పైన ఉదాహరణగా పేర్కొన్న ఆయతులను బట్టి స్పష్టంగా తెలిసేది ఏమిటంటే, దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారు ధర్మానికి సంబంధించిన ఏ ఒక్క విషయంలోనూ తన నోటి ద్వారా సొంతంగా ఏ ఒక్క పలుకు కూడా పలకలేదు. ఆయన నోటి నుండి వచ్చిన ప్రతీ ఒక్క పలుకు కేవలం అల్లాహ్ యొక్క వహీ ద్వారానే వెలువడినది.

★దైవప్రవక్తముహమ్మద్సల్లల్లాహు‘అలైహి వసల్లం వారు 40 సంవత్సరాల వయస్సులో అల్లాహ్ యొక్క ప్రవక్తగా నియమించబడ్డారు మరియు 63 సంవత్సరాల వయస్సులో ఆయన పరమపదించారు. ఆయన సల్లల్లాహు ‘అలైహి వసల్లం వారు మొత్తం 23 సంవత్సరాల వరకూ ప్రవక్త బాధ్యతను నిర్వర్తించారు. ఈ 23 సంవత్సరాల కాలంలో ఇస్లాం ధర్మానికి చెందిన ప్రతీ విషయంలోనూ ఆయన నోటి నుండి వెలువడిన వాక్కులన్నీ అల్లాహ్ నుండి అవతరింపబడినవే.

★ ఇక్కడ ఎదురయ్యే ప్రశ్న ఏమిటంటే, ఈ 23 సంవత్సరాల కాలంలో దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు ‘అలైహి వసల్లం వారు తమరి భార్యలతో (విశ్వాసుల మాతృమూర్తులతో) ఇస్లామ్ ధర్మానికి చెందిన ఏ ఒక్క మాటనూ బోధించకుండానే జీవితాన్ని గడిపారా? ఆడవారికి సంబంధించి వారికి ఎదురైన అన్ని ప్రశ్నలకు, సంశయాలకు ఇస్లామ్ ధర్మాదేశాల పరంగా వివరించారు మరియు బోధించారు. అలా బోధించిన ప్రతీదీ ఆయన తన సొంత మాటల ద్వారా ఏమీ కాదు కదా. అవి కూడా అల్లాహ్ యొక్క వహీనే కదా!

★ అలాగే, తమరి సహాబాలకు కూడా అల్లాహ్ ఆజ్ఞల (ఇస్లామ్ ధర్మం) పరంగా జీవితాన్ని గడిపేందుకు సంబంధించిన ఎన్నో బోధనలను, ఎన్నో ఆదేశాలను, ఎన్నో వివరణలను ఉపదేశించారు. అవన్నీ కూడా అల్లాహ్ యొక్క వహీనే కదా!

Abu Zafar Creative Designs
DESIGN THAT INSPIRES YOU

★ఇలా 23 సంవత్సరాల కాలంలో తమరి భార్యలకు, సహాబాలకు ఇస్లామ్ ధర్మపరంగా సరైన జీవితాన్ని గడిపేందుకు బోధించిన అన్ని విషయాలు, అన్ని జవాబులు, అన్ని ఉపదేశాలు ఖుర్'ఆన్‌లో ఎక్కడా తెలియజేయబడలేదు మరి. అవన్నీ కూడా ప్రత్యేకంగా హదీసుల ద్వారా పేర్కొనబడ్డాయి. కాబట్టి, హదీసులు కూడా అల్లాహ్ యొక్క వహీనే అనే విషయం దీని ద్వారా స్పష్టంగా ప్రస్ఫుటమవుతుంది.

★ కాబట్టి, నిజమైన ముస్లిం అనేవాడు హదీసులు కూడా అల్లాహ్ యొక్క వహీనే అని విశ్వసిస్తాడు. ముస్లిం పేరు పెట్టుకుని లేదా సమాజంలో ముస్లింగా కనిపిస్తూ తనకు ఇష్టం వచ్చినట్లు హదీసులను వ్యతిరేకిస్తూ ఉండేవాడు యదార్థానికి అసలు ఏమాత్రమూ ముస్లింనే కాడు. ఎందుకంటే, ఇస్లామ్ ధర్మానికే పునాది అయిన కలిమా లోని రెండవ భాగానికి ‘అష్ హదు అన్న ముహమ్మదున్ ‘అబ్దుహు వ రసూలుహు’ సాక్ష్యం పలికి మరీ దాన్ని సంపూర్ణంగా స్వీకరించకుండా తన ఇష్టం వచ్చినట్లు వ్యతిరేకించాడు కాబట్టి!

## * వహీ యొక్క విధానాలు *

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో వహీకి సంబంధించిన 3 విధానాలను తెలియజేసాడు.

وَمَا كَانَ لِبَشَرٍ أَن يُكَلِّمَهُ ٱللَّهُ إِلَّا وَحْيًا أَوْ مِن وَرَآئِ حِجَابٍ أَوْ يُرْسِلَ رَسُولًا فَيُوحِىَ بِإِذْنِهِۦ مَا يَشَآءُ ۚ إِنَّهُۥ عَلِىٌّ حَكِيمٌ

"మరియు అల్లాహ్ తో మాట్లాడగలిగే శక్తి ఏ మానవునికీ లేదు; కేవలం దివ్యజ్ఞానం (వహీ) ద్వారా లేదా తెర వెనుక నుండి, లేదా ఆయన పంపిన సందేశహరుని ద్వారా, ఆయన అనుమతితో, ఆయన కోరిన (వహీ) అవతరింపజేయబడటం తప్ప! నిశ్చయంగా, ఆయన మహోన్నతుడు, మహా వివేకవంతుడు."

Quran 42:51

1. మొదటి విధానం: వహ్యీ – అంటే, దివ్యజ్ఞానాన్ని (అల్లాహ్ ఆదేశాలను) నేరుగా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారి హృదయంలో నాటడం.

2. రెండవ విధానం: మిన్ వరాఇ హిజాబ్ – అంటే, తెర వెనుక నుండి అల్లాహ్ తన ఆదేశాలను ప్రవక్తకు అందజేయడం/ ఆదేశించడం.

3. మూడవ విధానం: యుర్సిల రసూలన్ ఫయూహియ – అంటే, అల్లాహ్ తాను కోరిన ఆదేశాలను దైవదూత (జిబ్రయీల్ 'అలైహిస్సలాం) ద్వారా ప్రవక్తకు అందజేయడం.

★ ఇదే విషయాన్ని అల్లాహ్ సుబహానహు వత'ఆలా తరువాతి ఆయతులో ఇలా తెలియజేసాడు.

وَكَذَٰلِكَ أَوْحَيْنَآ إِلَيْكَ رُوحًا مِّنْ أَمْرِنَاۚ مَا كُنتَ تَدْرِى مَا ٱلْكِتَٰبُ وَلَا ٱلْإِيمَٰنُ وَلَٰكِن جَعَلْنَٰهُ نُورًا نَّهْدِى بِهِۦ مَن نَّشَآءُ مِنْ عِبَادِنَاۚ وَإِنَّكَ لَتَهْدِىٓ إِلَىٰ صِرَٰطٍ مُّسْتَقِيمٍ

**"మరియు ఇదే విధంగా (ఓ ముహమ్మద్!) మేము మా ఆజ్ఞతో నీ వద్దకు దివ్యజ్ఞానం (రూహ్) అవతరింపజేశాము. (దీనికి ముందు) నీకు గ్రంథమేమిటో మరియు విశ్వాసమేమిటో తెలియదు. కాని మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) జ్యోతిగా జేసి, దీని ద్వారా మా దాసులలో మేము కోరిన వారికి, మార్గదర్శకత్వం చేస్తాము. మరియు నిశ్చయంగా, నీవు (ప్రజలకు) ఋజుమార్గం వైపునకు దారి చూపుతున్నావు."**

**Quran 42:52**

★ పై ఆయతు ద్వారా స్పష్టమైన విషయం ఏమిటంటే, అల్లాహ్ సుబహానహు వత'ఆలా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారికి మూడు రకాల పద్ధతుల ద్వారా వహీ అందించాడు. మరి ఖుర్'ఆన్ వహీ కి చెందిన ఏ పద్ధతి ద్వారా అందజేయబడింది? రండి తెలుసుకుందాము, ఇన్షా అల్లాహ్!

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

قُلْ مَن كَانَ عَدُوًّا لِّجِبْرِيلَ فَإِنَّهُۥ نَزَّلَهُۥ عَلَىٰ قَلْبِكَ بِإِذْنِ ٱللَّهِ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ وَهُدًى وَبُشْرَىٰ لِلْمُؤْمِنِينَ

**"(ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "జిబ్రీల్ పట్ల విరోధమున్న ప్రతివాడూ ఈ యథార్థాన్ని గ్రహించాలి. అల్లాహ్ ఆజ్ఞతోనే అతను ఈ ఖుర్ఆన్ ను నీ హృదయంపై అవతరింపజేశాడు. పూర్వం వచ్చిన అన్ని దివ్యగ్రంథాలను ఇది ధృవీకరిస్తున్నది మరియు విశ్వసించే వారికి ఇది సన్మార్గం చూపుతున్నది మరియు శుభవార్తను ఇస్తున్నది."**

**Quran 2:97**

★ ఈ ఆయతు ద్వారా స్పష్టమైన విషయం ఏమిటంటే, హజ్రత్ జిబ్రయీల్ 'అలైహిస్సలామ్ ద్వారా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై ఖుర్'ఆన్ అవతరింపజేయడం జరిగింది. అంటే, ఖుర్'ఆన్ అనేది వహీ యొక్క మూడవ విధానానికి చెందినది.

★ ఇదే విషయం ఖుర్'ఆన్ లో మరొక చోట నొక్కి చెప్పబడింది.

وَإِنَّهُۥ لَتَنزِيلُ رَبِّ ٱلْعَٰلَمِينَ

**మరియు నిశ్చయంగా, ఇది సర్వలోకాల ప్రభువు అవతరింపజేసిన (గ్రంథం).**

نَزَلَ بِهِ ٱلرُّوحُ ٱلْأَمِينُ

**దీనిని నమ్మదగిన ఆత్మ (రూహుల్ అమీన్) అవతరింపజేశాడు;**

عَلَىٰ قَلْبِكَ لِتَكُونَ مِنَ ٱلْمُنذِرِينَ

**నీ హృదయం మీద, నీవు హెచ్చరిక చేసేవారిలో చేరిపోవాలని;**

**Quran 26:192-194**

★ పై ఆయతుల ద్వారా ఎలాంటి సంశయమూ లేకుండా స్పష్టమైన విషయం ఏమిటంటే, అల్లాహ్ సుబహానహు వత'ఆలా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారికి హజ్రత్ జిబ్రయీల్ 'అలైహిస్సలామ్ ద్వారా వహీ యొక్క మూడవ విధానంలో ఖుర్'ఆన్ ను అవతరింపజేసాడు. మరి ఖుర్'ఆన్ వహీ యొక్క మూడవ విధానం ఐతే, వహీ యొక్క మిగిలిన రెండు విధానాలు ఎక్కడ ఉన్నాయి? ఆ రెండు విధానాలే "హదీసుల యొక్క అవతరణ" అనే సత్యాన్ని విశ్వసించవలసిన ఆవశ్యకత ప్రతీ ఒక్క ముస్లిం పై విధిగా ఉంది. కేవలం ఖుర్'ఆన్ గ్రంథమే కాకుండా, హదీసులు కూడా అల్లాహ్ తన ప్రవక్త పై అవతరింపజేసిన వహీలోని భాగమే!

★ అందుకనే, అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

إِنَّآ أَوْحَيْنَآ إِلَيْكَ كَمَآ أَوْحَيْنَآ إِلَىٰ نُوحٍ وَٱلنَّبِيِّـۧنَ مِنۢ بَعْدِهِۦ وَأَوْحَيْنَآ إِلَىٰٓ إِبْرَٰهِيمَ وَإِسْمَٰعِيلَ
وَإِسْحَٰقَ وَيَعْقُوبَ وَٱلْأَسْبَاطِ وَعِيسَىٰ وَأَيُّوبَ وَيُونُسَ وَهَٰرُونَ وَسُلَيْمَٰنَ ۚ وَءَاتَيْنَا دَاوُۥدَ زَبُورًا

**"(ఓ ప్రవక్తా!) నిశ్చయంగా, మేము నూహ్ కు మరియు అతని తర్వాత వచ్చిన ప్రవక్తలకు సందేశం (వహీ) పంపినట్లు, నీకు కూడా సందేశం పంపాము. మరియు మేము ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్హాఖ్, య'అఖూబ్ లకు మరియు అతని సంతతి వారికి మరియు ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్ మరియు సులైమాన్ లకు కూడా దివ్యజ్ఞానం (వహీ) పంపాము. మరియు మేము దావూద్ కు జబూర్ గ్రంథాన్ని ప్రసాదించాము."**

**Quran 4:163**

★ పై ఆయతులో అల్లాహ్ సుబహానహు వత'ఆలా మిగిలిన ప్రవక్తల పేర్లను ఒక్కొక్కరిగా ప్రస్తావిస్తూ వారందరిపై తన వహీని అవతరింపజేసినట్లుగా తెలియజేసాడు. హజ్రత్ నూహ్ 'అలైహిస్సలామ్ మరియు ఆయన తర్వాత వచ్చిన ప్రవక్తలందరిపై ఎలా అయితే వహీని అవతరింపజేయడం జరిగిందో, అలానే దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై కూడా అవతరింపజేయడం జరిగిందనే సత్యాన్ని తెలియజేసాడు. ఇందులో గమనించవలసిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, పైన పేర్కొన్న ప్రవక్తలలో కొందరి మీద గ్రంథాన్ని (తౌరాత్, జబూర్, ఇంజీల్, ఖుర్'ఆన్ లాగ ప్రత్యేక పుస్తకాన్ని) అవతరింపజేయలేదు. కాబట్టి, గ్రంథాన్ని ఇవ్వబడని మిగిలిన ప్రవక్తలకు హదీసుల రూపంలో వహీ అవతరింపజేయడం జరిగింది.

**హదీసులు కూడా అల్లాహ్ తన ప్రవక్త పై అవతరింపజేసిన వహీలోని భాగమే అనే సత్యానికి ఖుర్'ఆన్ ద్వారానే కొన్ని ఆధారాలను తెలుసుకుందాము రండి.**

## 1. కాబా కంటే ముందుగా ఉన్న ఖిబ్లా:

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

وَكَذَٰلِكَ جَعَلْنَٰكُمْ أُمَّةً وَسَطًا لِّتَكُونُوا۟ شُهَدَآءَ عَلَى ٱلنَّاسِ وَيَكُونَ ٱلرَّسُولُ عَلَيْكُمْ شَهِيدًا ۗ وَمَا
جَعَلْنَا ٱلْقِبْلَةَ ٱلَّتِى كُنتَ عَلَيْهَآ إِلَّا لِنَعْلَمَ مَن يَتَّبِعُ ٱلرَّسُولَ مِمَّن يَنقَلِبُ عَلَىٰ عَقِبَيْهِ ۚ وَإِن كَانَتْ
لَكَبِيرَةً إِلَّا عَلَى ٱلَّذِينَ هَدَى ٱللَّهُ ۗ وَمَا كَانَ ٱللَّهُ لِيُضِيعَ إِيمَٰنَكُمْ ۚ إِنَّ ٱللَّهَ بِٱلنَّاسِ لَرَءُوفٌ رَّحِيمٌ

**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి" మేము, మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము. మరియు ఎవరు సందేశహరుణ్ణి అనుసరిస్తారో మరియు ఎవరు తమ మడమల మీద వెనుదిరిగి పోతారో అనేది పరిశీలించడానికి నీవు పూర్వం అనుసరించే ఖిబ్లా (బైతుల్ మఖ్దిస్) ను ఖిబ్లాగా చేసి ఉన్నాము. మరియు ఇది వాస్తవానికి అల్లాహ్ మార్గదర్శకత్వం చూపిన వారికి తప్ప, ఇతరులకు భారమైనది. మరియు అల్లాహ్ మీ విశ్వాసాన్ని (బైతుల్ మఖ్దిస్ వైపునకు చేసిన నమాజులను) ఎన్నడూ వృథా చేయడు." నిశ్చయంగా, అల్లాహ్ ప్రజల పట్ల కనికరుడు, అపార కరుణాప్రదాత."**

Quran 2:143

★ పై ఆయతులో బైతుల్లాహ్ (కాబా) కు ముందు దేనినైతే ప్రజలు ఖిబ్లాగా చేసుకుని అల్లాహ్ ఆరాధన చేసేవారో, ఆ ఖిబ్లా వైపు ఆరాధన చేయాలనేది అల్లాహ్ ఆ జాతి ప్రజలకు ఇచ్చిన ఆదేశమే. మరియు "జ'అల్నా (మేము దానిని ఖిబ్లాగా చేశాము)" అని అల్లాహ్ స్పష్టంగా తెలియజేసాడు.

★ ఇక్కడ ఎదురయ్యే ప్రశ్న ఏమిటంటే, ఇంతకీ కాబాకు ముందు ప్రజలు అనుసరించే ఆ ఖిబ్లా ఏమిటో అనేది పూర్తి ఖుర్'ఆన్ లో ఎక్కడా తెలియజేయబడలేదు. మరి ఖుర్'ఆన్ లో తెలియజేయకుండా అల్లాహ్ ఎక్కడ తెలియజేసాడు? అంటే దీన్నిబట్టి దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై కేవలం ఖుర్'ఆన్ గ్రంథమే కాకుండా వేరొక విధానంలో వహీ అవతరణ జరిగిందన్న సత్యం రుజువు అవుతుంది. అవే హదీసుల అవతరణ. ఆ హదీసుల ద్వారానే పైన ఖుర్'ఆన్ లో పేర్కొన్న ఆ ఖిబ్లానే "బైతుల్ మఖ్దిస్" అని తెలియజేయబడింది.

## 2. ముగ్గురు వ్యక్తుల ప్రస్తావన:

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

وَعَلَى ٱلثَّلَٰثَةِ ٱلَّذِينَ خُلِّفُوا۟ حَتَّىٰٓ إِذَا ضَاقَتْ عَلَيْهِمُ ٱلْأَرْضُ بِمَا رَحُبَتْ وَضَاقَتْ عَلَيْهِمْ أَنفُسُهُمْ وَظَنُّوٓا۟ أَن لَّا مَلْجَأَ مِنَ ٱللَّهِ إِلَّآ إِلَيْهِ ثُمَّ تَابَ عَلَيْهِمْ لِيَتُوبُوٓا۟ ۚ إِنَّ ٱللَّهَ هُوَ ٱلتَّوَّابُ ٱلرَّحِيمُ

**"మరియు వెనుక ఉండి పోయిన ఆ ముగ్గురిని కూడా (ఆయన క్షమించాడు). చివరకు విశాలంగా ఉన్న భూమి కూడా వారికి ఇరుకై పోయింది. మరియు వారి ప్రాణాలు కూడా వారికి భారమయ్యాయి. అల్లాహ్ నుండి (తమను కాపాడుకోవటానికి) ఆయన శరణం తప్ప మరొకటి లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు ఆయన వారి పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు - వారు పశ్చాత్తాప పడాలని. నిశ్చయంగా, అల్లాహ్ మాత్రమే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, అపార కరుణా ప్రదాత."**

Quran 9:118

★ పై ఆయతులో అల్లాహ్ సుబహానహు వత'ఆలా ముగ్గురు వ్యక్తుల ప్రస్తావనను

తీసుకుని వచ్చి వారి పరిస్థితిని తెలియజేసాడు. మరి పూర్తి ఖుర్'ఆన్ మొత్తాన్ని మొదటి నుండి చివరి దాకా పరిశీలించి చూస్తే అసలు ఆ ముగ్గురు వ్యక్తులు ఎవరో, వారికి కలిగిన ఆ పరిస్థితి ఏమిటో అనేది ఎక్కడా దొరకదు.

★ కానీ, ఆ ముగ్గురి వ్యక్తులు ఎవరో అసలు వారి వృత్తాంతం ఏమిటో అనేది హదీసు ద్వారా చాలా కూలంకుషంగా వివరించబడింది. ఆ మొత్తం హదీసును సహీహ్ బుఖారీలోని, కితాబుల్ మగాజీ (బుక్ #64), తబూక్ యుద్ధ అంశం (చాప్టర్ #79), హదీసు #4418 లో గమనించవచ్చు. దీన్నిబట్టి కూడా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై కేవలం ఖుర్'ఆన్ గ్రంథమే కాకుండా వేరొక విధానంలో వహీ అవతరణ జరిగిందన్న సత్యం రుజువు అవుతుంది.

## 3. తరచుగా పఠించబడే ఏడు ఆయతులు (సూరతుల్ ఫాతిహా):

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

وَلَقَدْ ءَاتَيْنَٰكَ سَبْعًا مِّنَ ٱلْمَثَانِى وَٱلْقُرْءَانَ ٱلْعَظِيمَ

**"మరియు మేము నిశ్చయంగా, నీకు తరచుగా పఠింపబడే ఏడు (సూక్తులను) మరియు సర్వోత్తమ ఖుర్ఆన్ ను ప్రసాదించాము."**

Quran 15:87

★ పై ఆయతులో పేర్కొన్నట్లు తరచుగా పఠించబడే ఆ ఏడు ఆయతులు ఏమిటి? పూర్తి ఖుర్'ఆన్ మొత్తాన్ని మొదటి నుండి చివరి దాకా పరిశీలించి చూస్తే ఆ ఏడు ఆయతులేమిటో అనేది ఎక్కడా దొరకదు.

★ కానీ, ఆ ఏడు ఆయతులు ఏమిటో అనేది కేవలం హదీసు ద్వారా మాత్రమే తెలియజేయబడింది. ఆ హదీసును సహీహ్ బుఖారీలోని, కితాబుత్తఫ్సీర్ (బుక్ #65), చాప్టర్ #3, హదీసు #4704 లో స్పష్టంగా గమనించవచ్చు.

★ దీన్నిబట్టి కూడా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై కేవలం ఖుర్'ఆన్ గ్రంథమే కాకుండా వేరొక విధానంలో వహీ అవతరణ జరిగిందన్న సత్యం మన కళ్ళు, హృదయాల ముందు తేటతెల్లం అవుతుంది.

## 4. దొంగ చేతిని నరకడం:

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

وَٱلسَّارِقُ وَٱلسَّارِقَةُ فَٱقْطَعُوٓا۟ أَيْدِيَهُمَا جَزَآءًۢ بِمَا كَسَبَا نَكَٰلًا مِّنَ ٱللَّهِ ۗ وَٱللَّهُ عَزِيزٌ حَكِيمٌ

**"మరియు పురుషుడు దొంగ అయినా, లేదా స్త్రీ దొంగ అయినా, వారి చేతులను నరికి వేయండి. ఇది వారి కర్మలకు గుణపాఠంగా అల్లాహ్ నిర్ణయించిన ప్రతిఫలం (శిక్ష). మరియు అల్లాహ్ సర్వ శక్తిమంతుడు, మహా వివేచనాపరుడు."**

Quran 5:38

★ అరబీ భాషలో "యదున్ లేదా యద్" అన్న పదానికి అర్థం చేతివ్రేలి నుండి చంక వరకూ ఉన్న మొత్తం చేతిని సూచిస్తుంది. మరి అలాంటప్పుడు ఏ చేతిని నరకాలి మరియు ఎక్కడ వరకూ నరకాలి? ఈ విషయం మీద ఖుర్'ఆన్ మౌనం వహించి ఉంది. అంటే, ఖుర్'ఆన్ లో ఎక్కడా దీని వివరణ లేదు.

★ ఏ చేతిని, ఎక్కడ వరకూ నరకాలి అనేది కేవలం హదీసు ద్వారా మాత్రమే తెలియజేయబడింది. ఆ హదీసును సహీహ్ బుఖారీలోని, కితాబుల్ హుదూద్ (బుక్ #86), చాప్టర్ #13 స్పష్టంగా గమనించవచ్చు.

★ దీన్నిబట్టి కూడా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై కేవలం ఖుర్'ఆన్ గ్రంథమే కాకుండా వేరొక విధానంలో వహీ అవతరణ జరిగిందన్న సత్యం మన కళ్ళు, హృదయాల ముందు తేటతెల్లం అవుతుంది.

Abu Zafar Creative Designs

## 5. దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం దగ్గరకు వచ్చిన గుడ్డి వ్యక్తి:

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

عَبَسَ وَتَوَلَّىٰٓ

أَن جَآءَهُ ٱلْأَعْمَىٰ

وَمَا يُدْرِيكَ لَعَلَّهُۥ يَزَّكَّىٰٓ

أَوْ يَذَّكَّرُ فَتَنفَعَهُ ٱلذِّكْرَىٰٓ

أَمَّا مَنِ ٱسْتَغْنَىٰ

فَأَنتَ لَهُۥ تَصَدَّىٰ

**అతను (ప్రవక్త) భృకుటి ముడి వేసుకున్నాడు మరియు ముఖం త్రిప్పకున్నాడు;**
**ఆ గ్రుడ్డివాడు తన వద్దకు వచ్చాడని!**
**కాని నీకేం తెలుసు? బహుశా అతడు తనను తాను సంస్కరించుకోవచ్చు!**
**లేదా అతడు హితబోధ పొందవచ్చు మరియు ఆ హితబోధ అతనికి ప్రయోజనకరం కావచ్చు!**
**కాని అతడు, ఎవడైతే తనను తాను స్వయం సమృద్ధుడు, అనుకుంటున్నాడో!**
**అతని పట్ల నీవు ఆసక్తి చూపుతున్నావు.**

**Quran 80:1-6**

★ పై ఆయతులో తెలియజేసిన దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారి దగ్గరికి వచ్చిన గుడ్డి వ్యక్తి ఎవరు? దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారు ఎందుకని ఆ వ్యక్తి నుండి తన ముఖాన్ని త్రిప్పుకున్నారు? ఆ సమయంలో దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారు ఎవరితో, ఏ విషయం గురించి మాట్లాడుతున్నారు? పూర్తి ఖుర్'ఆన్ మొత్తాన్ని మొదటి నుండి చివరి దాకా పరిశీలించి చూస్తే ఈ వృత్తాంతానికి సంబంధించిన విషయం ఎక్కడా దొరకదు.

★ కానీ ఈ వృత్తాంతానికి సంబంధించిన మొత్తం విషయం హదీసులో లభిస్తుంది. ఆ హదీసును జామి'అత్తిర్మిజీ, వాల్యూమ్ #5, కితాబుత్తఫ్సీర్ (బుక్ #44), హదీసు #3331 లో స్పష్టంగా గమనించవచ్చు.

★ దీన్నిబట్టి కూడా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై కేవలం ఖుర్'ఆన్ గ్రంథమే కాకుండా వేరొక విధానంలో వహీ అవతరణ జరిగిందన్న సత్యం రూఢీ అవుతుంది.

## 6. ఖర్జూరపు చెట్ల గురించి అల్లాహ్ ఇచ్చిన ఆజ్ఞ:

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

مَا قَطَعْتُم مِّن لِّينَةٍ أَوْ تَرَكْتُمُوهَا قَآئِمَةً عَلَىٰٓ أُصُولِهَا فَبِإِذْنِ ٱللَّهِ وَلِيُخْزِىَ ٱلْفَٰسِقِينَ

**"(ఓ విశ్వాసులారా!) మీరు ఏ ఖర్జూరపు చెట్లను నరికివేశారో లేక ఏ ఖర్జూరపు చెట్లను వాటి వ్రేళ్ళ మీద నిలబడేలా వదలి పెట్టారో, అంతా అల్లాహ్ ఆజ్ఞతోనే జరిగింది. మరియు ఇదంతా అవిధేయులను అవమానించటానికి జరిగిన విషయం."**

Quran 59:5

Abu Zafar Creative Designs
DESIGN THAT INSPIRES YOU

★ పై ఆయతులో 'అంతా అల్లాహ్ ఆజ్ఞతోనే జరిగింది' అని తెలియజేయబడింది. ఇక్కడ ఎదురయ్యే ప్రశ్న ఏమిటంటే, పూర్తి ఖుర్'ఆన్ లో ఈ సంఘటన గురించి మరియు ఆ అల్లాహ్ ఆజ్ఞ ఏమిటి అనే విషయం గురించి ఎక్కడా తెలియజేయబడలేదు.

★ కానీ హదీసును పరిశీలిస్తే ఈ ఆయతుకు సంబంధించిన పూర్తి వృత్తాంతం అవగతమవుతుంది. ఆ హదీసును సహీహ్ బుఖారీలోని, కితాబుత్తఫ్సీర్ (బుక్ #65), చాప్టర్ #59, హదీసు #4884 లో స్పష్టంగా గమనించవచ్చు.

★ దీన్నిబట్టి కూడా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై కేవలం ఖుర్'ఆన్ గ్రంథమే కాకుండా వేరొక విధానంలో వహీ అవతరణ జరిగిందన్న సత్యం మన కళ్ళు, హృదయాల ముందు తేటతెల్లం అవుతుంది.

## 7. దైవప్రవక్త సల్లల్లాహు ‘అలైహి వసల్లం తన భార్యకు చెప్పిన రహస్య విషయం:

★ అల్లాహ్ సుబహానహు వత’ఆలా ఖుర్’ఆన్ లో ఇలా తెలియజేసాడు.

وَإِذْ أَسَرَّ ٱلنَّبِىُّ إِلَىٰ بَعْضِ أَزْوَٰجِهِۦ حَدِيثًا فَلَمَّا نَبَّأَتْ بِهِۦ وَأَظْهَرَهُ ٱللَّهُ عَلَيْهِ عَرَّفَ بَعْضَهُۥ وَأَعْرَضَ عَنۢ بَعْضٍۢ ۖ فَلَمَّا نَبَّأَهَا بِهِۦ قَالَتْ مَنْ أَنۢبَأَكَ هَٰذَا ۖ قَالَ نَبَّأَنِىَ ٱلْعَلِيمُ ٱلْخَبِيرُ

**“మరియు (జ్ఞాపకం చేసుకోండి) ప్రవక్త తన భార్యలలో ఒకామెకు రహస్యంగా ఒక విషయం చెప్పగా ఆమె దానిని (ఆ రహస్యాన్ని) మరొకామెకు చెప్పింది. మరియు అల్లాహ్ అతనికి (ప్రవక్తకు) ఆ విషయాన్ని తెలియజేశాడు. (వాస్తవానికి) అతను (ప్రవక్త) ఆ విషయాన్ని (మొదటి) ఆమెకు కొంత తెలిపి, మరికొంత తెలుపలేదు. ఇక అతను (ప్రవక్త, మొదటి) ఆమెకు దానిని (రహస్యం బయట పడిన సంగతిని) తెలిపినప్పుడు, ఆమె (ఆశ్చర్యపోతూ) అతనితో ఇలా అడిగింది: “ఇది నీకు ఎవరు తెలిపారు?” అతను జవాబిచ్చాడు: “నాకు ఈ విషయం ఆ సర్వజ్ఞుడు, ఆ సర్వం తెలిసినవాడు తెలిపాడు.””**

**Quran 66:3**

★ పై ఆయతులో పేర్కొన్నట్లు దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు ‘అలైహి వసల్లం వారు ఏ భార్యకు ఏ రహస్య విషయాన్ని తెలియజేసారు. అసలు ఆ సంఘటన ఏమిటి? పూర్తి ఖుర్’ఆన్ మొత్తాన్ని మొదటి నుండి చివరి దాకా పరిశీలించి చూస్తే ఈ సంఘటనకు సంబంధించిన విషయం ఎక్కడా దొరకదు.

★ కానీ దీని వృత్తాంతం మొత్తం హదీసులో నిక్షిప్తమై ఉంది. ఆ హదీసును సహీహ్ బుఖారీలోని, కితాబుత్తఫ్సీర్ (బుక్ #65), చాప్టర్ #66 లో తెలియజేసిన హదీసులలో స్పష్టంగా గమనించవచ్చు.

★ దీన్నిబట్టి కూడా దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు ‘అలైహి వసల్లం వారిపై కేవలం ఖుర్’ఆన్ గ్రంథమే కాకుండా వేరొక విధానంలో వహీ అవతరణ జరిగిందన్న సత్యం మన కళ్ళు, హృదయాల ముందు తేటతెల్లం అవుతుంది.

## 8. వివేకం అంటే హదీసు:

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

وَأَنزَلَ ٱللَّهُ عَلَيْكَ ٱلْكِتَٰبَ وَٱلْحِكْمَةَ وَعَلَّمَكَ مَا لَمْ تَكُن تَعْلَمُ

**"...మరియు అల్లాహ్ నీ పై ఈ గ్రంథాన్ని మరియు వివేకాన్ని అవతరింపజేశాడు. మరియు నీకు తెలియని విషయాలను నీకు నేర్పాడు..."**

Quran 4:113

★ పై ఆయతులో అల్లాహ్ సుబహానహు వత'ఆలా రెండు విషయాల అవతరణ (వహీ) గురించి తెలియజేసాడు. అవి గ్రంథం మరియు వివేకం. గ్రంథం అంటే ఖుర్'ఆన్ అని బోధపడుతుంది. మరి వివేకం కూడా అవతరింపజేసాడు అంటే అర్థం ఏమిటి? వివేకం అంటే హదీసులు అన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది.

★ ఇమామ్ షాఫయీ రహిమహుల్లాహ్ అర్రిసాలా, పేజీ #78 లో ఇలా తెలిపారు.

**"فذكر الله الكتاب، وهو القرآن، وذكر الحكمة، فسمعت من أرضى من أهل العلم بالقرآن يقول: الحكمة سنة رسول الله ﷺ"**

**"అల్లాహ్ 'గ్రంథం' అని ఏదైతే తెలియజేసాడో అది ఖుర్'ఆన్ మరియు ఏ 'వివేకం' గురించి అయితే తెలియజేసాడో దాని గురించి ఖుర్'ఆన్ జ్ఞానంలో నిష్ణాతులైన తఫ్సీర్ పండితుల (ముఫస్సిరీన్) ద్వారా నేను విన్న, మెచ్చిన విషయమేమిటంటే, వారు అన్నారు: వివేకం అంటే దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారి సున్నత్ సాంప్రదాయం, అవే హదీసులు."**

★ హాఫిజ్ ఇబ్నె కసీర్ రహిమహుల్లాహ్ వారు తఫ్సీర్ ఇబ్నె కసీర్ లో ఇలా తెలియజేసారు.

**الحكمة يعني السنة**

**"హిక్మత్ (వివేకం) అంటే సున్నత్ (హదీసుల ద్వారా బోధించబడిన దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారి సున్నత్ సాంప్రదాయం)."**

★ ప్రతీ ఒక్క ముఫస్సిర్ (ఖుర్'ఆన్ తఫ్సీర్ పండితుడు) హిక్మత్ అన్న దానికి అర్థం "సున్నత్" అనే తెలియజేసారు. ఆ సున్నత్ మొత్తం హదీసుల ద్వారానే వివరించబడినవి. దీన్ని బట్టి హదీసులు కూడా అల్లాహ్ సుబహానహు వత'ఆలా యొక్క అవతరణనే (వహీనే) అన్న విషయం స్పష్టమవుతుంది.

## 9. సంవత్సరంలో ఉన్న నెలల సంఖ్య, వాటి పేర్లు:

★ అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఖుర్'ఆన్ లో ఇలా తెలియజేసాడు.

إِنَّ عِدَّةَ ٱلشُّهُورِ عِندَ ٱللَّهِ ٱثْنَا عَشَرَ شَهْرًا فِى كِتَٰبِ ٱللَّهِ يَوْمَ خَلَقَ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضَ مِنْهَآ أَرْبَعَةٌ حُرُمٌ ذَٰلِكَ ٱلدِّينُ ٱلْقَيِّمُ

**"నిశ్చయంగా, నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర పన్నెండు నెలలు మాత్రమే. ఇది భూమ్యాకాశాలు సృష్టించిన దినం నుండి అల్లాహ్ గ్రంథంలో వ్రాయబడి ఉంది. వాటిలో నాలుగు నిషిద్ధ (మాసాలు). ఇదే సరైన ధర్మం..."**

Quran 9:36

★ పూర్తి ఖుర్'ఆన్ లో ఎక్కడా కూడా పై ఆయతులో తెలియజేసిన 12 నెలల పేర్లు చెప్పబడలేదు. అలాగే ఆ నిషిద్ధ మాసాలేమిటో అన్న విషయంలో కూడా ఖుర్'ఆన్ మౌనం వహించి ఉంది. కానీ, అల్లాహ్ మాత్రం ఈ విషయం అల్లాహ్ గ్రంథంలో (ఫీ కితాబిల్లాహ్) వ్రాయబడి ఉంది అని తెలియజేసాడు. మరి ఖుర్'ఆన్ లో లేనప్పుడు ఇంకెక్కడ ఉంది? అల్లాహ్ స్వయంగా పేర్కొన్న ఆ మరొక అల్లాహ్ గ్రంథం (వహీ) ఏమిటి?

Abu Zafar Creative Designs
DESIGN THAT INSPIRES YOU

★ పై ఆయతులో అల్లాహ్ తెలియజేసిన ఆ అల్లాహ్ గ్రంథం "హదీసులు" అనే సత్యం స్పష్టమవుతుంది. అందుకనే, ఆ 12 నెలల పేర్లు, నిషిద్ధ మాసాల వివరణ అంతా హదీసులో తెలియజేయబడింది. ఆ హదీసును సహీహ్ బుఖారీలోని, కితాబుత్తఫ్సీర్ (బుక్ #65), చాప్టర్ #9, హదీసు #4662 లో స్పష్టంగా గమనించవచ్చు.

## 10. బద్ర్ యుద్ధ సమయంలో అల్లాహ్ చేసిన వాగ్దానం:

★ బద్ర్ యుద్ధం ముగిసిన తర్వాత మాలె గనీమత్ (యుద్ధంలో నెగ్గిన సంపద) ఎలా పంచుకోవాలి అనే ప్రశ్న లేవనెత్తిన సమయంలో సూరతుల్ అన్ఫాల్ అవతరించింది. మరియు అందులో అల్లాహ్ సుబహానహు వత'ఆలా ఇలా తెలియజేసాడు.

وَإِذْ يَعِدُكُمُ ٱللَّهُ إِحْدَى ٱلطَّآئِفَتَيْنِ أَنَّهَا لَكُمْ وَتَوَدُّونَ أَنَّ غَيْرَ ذَاتِ ٱلشَّوْكَةِ تَكُونُ لَكُمْ وَيُرِيدُ ٱللَّهُ أَن يُحِقَّ ٱلْحَقَّ بِكَلِمَٰتِهِۦ وَيَقْطَعَ دَابِرَ ٱلْكَٰفِرِينَ

**"మరియు (జ్ఞాపకం చేసుకోండి) ఆ రెండు పక్షాలలో, ఒక పక్షం మీ చేతికి తప్పక చిక్కుతుందని అల్లాహ్ మీతో వాగ్దానం చేసినప్పుడు; ఆయుధాలు లేని పక్షం మీకు దొరకాలని మీరు కోరుతూ ఉన్నారు. కాని అల్లాహ్ తాను ఇచ్చిన మాట ప్రకారం సత్యాన్ని సత్యంగా నిరూపించాలనీ మరియు అవిశ్వాసులను సమూలంగా నాశనం చేయాలని కోరాడు."**

**Quran 8:7**

★ పై ఆయతులో వారితో అల్లాహ్ వాగ్దానం చేసాను అని తెలియజేసాడు. కానీ, అల్లాహ్ వారికి చేసిన ఆ వాగ్దానం ఏమిటో పూర్తి ఖుర్'ఆన్ లో ఎక్కడా దొరకదు. కానీ దీని యొక్క వృత్తాంతం మొత్తం హజ్రత్ 'అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు 'అన్హు ఉల్లేఖనం ద్వారా పేర్కొన్న దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారి హదీసులో పొందుపరచబడి ఉంది. ఆ వృత్తాంతాన్ని తఫ్సీర్ అత్తబరీ మరియు తఫ్సీర్ ఇబ్నె కసీర్ లో చూడవచ్చు.

★ దీన్ని బట్టి హదీసులు కూడా అల్లాహ్ సుబహానహు వత'ఆలా యొక్క అవతరణనే (వహీనే) అన్న విషయం స్పష్టమవుతుంది.

★ చెప్పుకుంటూ పోతే హదీసులు కూడా వహీ అన్న సత్యానికి సంబంధించిన ఆధారాలు ఖుర్'ఆన్ ద్వారానే ఎన్నో లభ్యమవుతాయి. అలానే మున్కిరీనె హదీసు సమూహం వారు ధర్మానికి సంబంధించిన ప్రతీ విషయంలోనూ తమ లాజిక్కును ప్రదర్శిస్తారు. ఏదైనా విషయం వారి లాజిక్కుల పరంగా కేవలం ఖుర్'ఆన్ లో ఉంటేనే, వాటిని మాత్రమే వీరు పాటిస్తారు.

★ ఒకవేళ ఆ (ఏదైనా) విషయం ఖుర్'ఆన్ లో లేకపోతే అది తప్పుడు విషయంగా మరియు అది పాటించడానికి సరితూగనిదిగా విశ్వసిస్తారు. దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారి ప్రతీ హదీసును వీరు తమ మెదడులో ఉద్భవించిన లాజిక్కులతో చెక్ చేసి, ఆ లాజిక్కులతో ఏకీభవిస్తేనే ఆ హాదీసులను నిజమైనవిగా స్వీకరిస్తారు.

Abu Zafar Creative Designs
DESIGN THAT INSPIRES YOU

★ అలా ఏకీభవించని యెడల అది ఎంతటి సహీహ్ హదీసు అయినప్పటికీ మరియు ప్రపంచంలోని ముస్లిం సమాజం మొత్తం ఏకాభిప్రాయంతో ఆ హదీసు ప్రకారం సహాబాల కాలం నుండి ఇప్పటివరకూ తరతరాలుగా ఆచరిస్తూ వస్తున్నప్పటికీ మున్కిరీనె హదీసు సమూహం వారు మాత్రం దాన్ని తప్పుడు హదీసుగానే పరిగణిస్తారు.

★ సుబహానల్లాహ్, చూడండి వీరి అజ్ఞానం, మూర్ఖత్వం మరియు ధర్మసూత్రాల పట్ల వీరికున్న అవగాహనా రాహిత్యం. ఇలాంటి అజ్ఞానంతోనే వీరు ఎన్నో సహీహ్ హదీసులను తిరస్కరించి ఋజుమార్గం నుండి పూర్తిగా తప్పిపోయారు.

★ ధర్మం పట్ల వీరికున్న అవగాహనా రాహిత్యానికి ఉదాహరణగా అనునిత్యం వీరు తమ జీవితంలో పాటించే విషయాల గురించి కొన్ని సూటి ప్రశ్నలు క్రింద అడగడం జరుగుతుంది. వీరు ఈ ప్రశ్నలకు సమాధానం కేవలం ఒక్క ఖుర్'ఆన్ నుండి మాత్రమే ఇవ్వాలి, ఎందుకంటే వీరు హదీసులను తిరస్కరిస్తారు కాబట్టి. వీరు క్రిందా మీదా పడి ఎంత ప్రయత్నించినా సరే వీటికి సమాధానాలు ఇవ్వడం వీరి వల్ల కాదు. మరి అలాంటప్పుడు ఖుర్'ఆన్ లో తెలియజేయబడని ఈ విషయాలను, ఈ పద్ధతులను ఏ ఆధారాన్ని బట్టి వీరు తమ దైనందిన జీవితాలలో ఆచరిస్తున్నారు? అసలు విషయం ఏమిటంటే, రెండు నాల్కల ధోరణి కలిగిన వీరు క్రింది వాటిని తమ దైనందిన జీవితాలలో ఆచరించడానికి కేవలం హదీసుల మీదనే ఆధారపడతారు.

Abu Zafar Creative Designs
DESIGN THAT INSPIRES YOU

1. దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు 'అలైహి వసల్లం వారిపై అవతరింపబడిన సూరతుల్ 'అలఖ్ లోని మొట్టమొదటి 5 ఆయతులు ద్వారా ఆయన దైవప్రవక్తగా నియమించబడిన విషయం, ఆ ఆయతులు అల్లాహ్ యొక్క వాక్కు అని, తీసుకుని వచ్చిన వారు అల్లాహ్ యొక్క దూత మరియు ఆయన పేరు జిబ్రయీల్ ('అలైహిస్సలామ్) అని ఎలా తెలిసిపోయింది?

2. ఖుర్'ఆన్ లో మక్కాలో అవతరింపబడిన సూరహ్ లు ఏవి... మదీనాలో అవతరింపబడిన సూరహ్ లు ఏవి... అనే విషయాన్ని ఖుర్'ఆన్ నుండి ఎలా తెలుసుకోవాలి?

3. ఖుర్'ఆన్ లో అవతరింపబడిన సూరహ్ ల పేర్లు, ఆయతుల సంఖ్య, వాటి వరుసగా చేయడం ఇదంతా ఖుర్'ఆన్ లో ఎక్కడ నిర్ధారితం చేయబడింది?

4. వజూ చేసిన తర్వాత ఏ దు'ఆ చదవాలి? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

5. రోజులోని మొత్తం 5 పూటల నమాజు యొక్క విధానం మరియు వాటి రకాతుల వివరణ ఖుర్'ఆన్ లో ఎక్కడ ఇవ్వబడింది?

6. నమాజులో ప్రతీ రకాతులో సూరహ్ ఫాతిహానే చదవాలి అని ఎలా తెలిసింది మరియు ఖుర్'ఆన్ లో ఎక్కడ తెలియజేయబడింది?

7. నమాజులో ఏదైనా తప్పు, పొరపాటు జరిగితే ఆ నమాజును ఎలా సరిదిద్దుకోవాలనే పద్ధతి ఖుర్'ఆన్ లో ఎక్కడ తెలియజేయబడింది?

8. అల్లాహ్ ఆదేశించిన నమాజులలో ఇవి ఫర్ద్ మరియు ఇవి సున్నత్ నమాజులు అని ఖుర్'ఆన్ ద్వారా ఎలా నిర్ధారించుకోవాలి?

9. నమాజులో మగవారు, ఆడవారు, పిల్లలు ఉంటే నమాజు ఎలా చదవాలి అనే విషయం ఖుర్'ఆన్ లో ఎక్కడ తెలియజేయబడింది?

10. ఆడవారిని ఇమామ్ గా పెట్టి నమాజు ఎలా చదవాలి? ఎప్పుడు చదవాలి? ఆమె ఎవరికి ఇమాం కాగలదు? ఎవరికి కాజాలదు? ఖుర్'ఆన్ లో దీని గురించి ఎక్కడ తెలియజేయబడింది?

11. ప్రయాణంలో ఉన్నప్పుడు నమాజులను ఎలా ఆచరించాలి? ఏ నమాజు రకాతులను తగ్గించుకోవాలి? ఖుర్'ఆన్ లో దీని గురించి ఎక్కడ తెలియజేయబడింది?

12. జకాతుకు సంబంధించిన పూర్తి లెక్కలు, నిసాబ్ మరియు జకాతు ధనాన్ని ఏ రకంగా నిర్ధారణ చేయాలి? సాహిబె నిసాబ్ ని ఎలా నిర్ధారణ చేయాలి? ఖుర్'ఆన్ లో దీని గురించి ఎక్కడ తెలియజేయబడింది?

13. జిజియా పన్నును ఖుర్'ఆన్ నుండి ఎలా, ఏ రకంగా నిర్ధారణ చేయాలి?

Abu Zafar Creative Designs

14. ఖుర్'ఆన్ లో మద్యం త్రాగడం, త్రాగకపోవడం రెండింటి గురించి ప్రస్తావించబడింది. మరి మద్యం అనేది హలాల్ నా, హరామ్ నా ఎలా నిర్ధారించాలి? ఏ ఆయతు ముందు వచ్చింది, ఏ ఆయతు వెనుక వచ్చింది? ఖుర్'ఆన్ లో దీని గురించి ఎక్కడ తెలియజేయబడింది?

15. పెళ్ళి చేసుకునే పూర్తి విధానం ఖుర్'ఆన్ లో ఎక్కడ తెలియజేయబడింది?

16. భార్యతో మలద్వారం గుండా రతి చేయవచ్చా? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

17. మర్మాంగం నుండి మజీ కారితే గుసుల్ చేయాల్సిన అవసరం ఉందా, లేదా? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

18. ఉపవాసాన్ని ఎలా పాటించాలి? ఉపవాసాన్ని భంగం చేసే విషయాలు, చేయని విషయాలు ఏమిటి? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

19. హజ్జ్ ను పూర్తి విధానంలో ఎలా, ఎన్ని రోజులు, ఎక్కడెక్కడ ఆచరించాలి? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

Abu Zafar Creative Designs
DESIGN THAT INSPIRES YOU

20. అరఫా మరియు ముజ్దలిఫా వద్ద నమాజులను ఎలా ఆచరించాలి? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

21. ఇహ్రామ్ లో ఉన్నప్పుడు ఏమి చేయాలి? ఏమి చేయకూడదు? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

22. తల్బియా ఏది చదవాలి? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

23. ఖుర్బానీ యొక్క పూర్తి విధానం ఏమిటి? ఏయే వయస్సు గల జంతువులను ఖుర్బానీ చేయాలి? ఏ లోపాలు ఉండకూడదు? ఎలాంటి లోపాలుంటే చెల్లుతుంది? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

24. తినేందుకు చనిపోయిన ఏ రెండు రకాల జంతు మాంసం హలాల్? మరియు ఏ రెండు రకాల రక్తం హలాల్? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

25. ఒక ముస్లిం రోజువారీ చదివే దు'ఆ లు ఎన్ని ఉన్నాయి? అవేమిటి? ఖుర్'ఆన్ లో దీని గురించి ఏమని తెలియజేయబడింది?

★ కేవలం ఇవే ప్రశ్నలు కాదు. ఇలా అడుగుతూ పోతే లెక్కలేనన్ని ప్రశ్నలు వస్తూనే ఉంటాయి. మరియు వీటన్నింటికీ కేవలం ఖుర్'ఆన్ నుండే సమాధానాలు కావాలంటే ఇక మున్కిరీనె హదీసు సమూహం మొత్తానికి, వీరి తరాలకు ప్రళయం వరకూ ఎంత జీవిత కాలాల సమయాన్ని ఇచ్చినా సరే హదీసుల ఆశ్రయాన్ని పొందనిదే వీరు ఏ ఒక్కదానికీ జవాబును ఇవ్వలేరు.

★ సోషల్ మీడియాలో ఈ హదీసు తిరస్కారులు తమ అజ్ఞానంతో ధర్మసూత్రాల పట్ల తమ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తూ తమతో పాటు అమాయక ముస్లింలను కూడా ఋజుమార్గం నుండి తప్పిపోయేలా చేస్తున్నారు. మన మధ్య దాగి ఉన్న ఇటువంటి అత్యంత ప్రమాదకరమైన వారిని గుర్తించి, వారికి దూరంగా ఉంటూ మీ విశ్వాసాన్ని, మీ ధర్మాన్ని కాపాడుకోవడం మీ బాధ్యత. అల్లాహ్ దయతో మా ఈ చిన్న ప్రయత్నాన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

Abu Zafar Creative Designs
DESIGN THAT INSPIRES YOU

★ హదీసులను తిరస్కరించి ఋజుమార్గాన్ని తప్పి భ్రష్టమార్గంలో పడిపోయిన మున్కిరీనె హదీసు సమూహానికి చెందినవారు, పైన తెలియజేసిన కొన్ని ఉదాహరణల ద్వారా ఇప్పటికైనా సత్యాన్ని గ్రహించి అల్లాహ్ తో తౌబా చేసుకుని ఋజుమార్గంపై తిరిగి వస్తారని మనస్పూర్తిగా ఆశిస్తున్నాను మరియు వారి కోసం అల్లాహ్ తో దు'ఆ చేస్తున్నాను.

★ సుబహానక అల్లాహుమ్మ వ బి హమ్దిక,అష్హదు అన్ లా ఇలాహ ఇల్లా అన్త, అస్తగ్ ఫిరుక వ అతూబు ఇలైక. వ ఆఖిరు దావానా అనిల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ 'ఆలమీన్.



మీ సోదరుడు,
ఇక్రాముద్దీన్ ముహమ్మద్
అస్ సిరాతుల్ ముస్తఖీమ్ & వెలుగు కిరణాలు